www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 7 ఆగస్టు 2023
5
తిరుపతి



## తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవారి టోకెన్ రహిత సర్వదర్శనానికి 23 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. స్వామివారి సర్వదర్శనానికి సుమారు 12 గంటల సమయం పడుతోంది. క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్నీ ఏర్పాట్లు చేశారు. శనివారం శ్రీవారిని 81,472 మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి హుండీ ఆదాయం 3.90 కోట్ల రూపాయలు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వెల్లడించారు. శ్రీవారికి 38,820 మంది భక్తులు తలనీలాలు సమర్పించినట్లు అధికారులు వెల్లడించారు.

# బాబూ దమ్ముంటే నాపై పోటీ చెయ్

- అవినీతిపై విచారణకు సిద్ధమా..!!
- ఎమ్మెల్యే బియ్యపు సవాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి


ప్రజాశక్తి–శ్రీకాళహస్తి: చంద్రబాబూ..! నా మీద పోటీకి బొజ్జల సుధీర్‌రెడ్డి చాలరు. దమ్ముంటే మీరు కానీ, మీ కుమారుడు నారా లోకేష్ కానీ శ్రీకాళహస్తికి వచ్చి పోటీ చేయండి. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో నేను అవినీతికి పాల్పడుతున్నానని ఆరోపించారు. అవినీతిపై విచారణకు మీరు సిద్ధమా..? అయితే శ్రీకాళహస్తి రండి. అవినీతి, అభివద్ధిపై విచారణకు నేను సిద్ధంగా ఉన్నా" అని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి సవాల్ విసిరారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' పేరుతో శ్రీకాళహస్తిలో శనివారం నిర్వహించిన సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మాట్లాడిన మాటలన్నీ అబద్ధాలే అన్నారు. చంద్రబాబునాయుడుకు వయసు మళ్లి ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆయన మాట్లాడే మాటలకు పొంతన ఉండటం లేదని బియ్యపు మధు విమర్శించారు. తాను అక్రమాలకు పాల్పడుతున్నానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. బొజ్జల కుటుంబం లాగా ఎర్రచందనం స్మగ్లింగ్, పేదల భూమి కబ్జా చేయలేదన్నారు. తమది జమీందారీ కుటుంబం అన్నారు. తన తాత రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేశారని ఆయన గుర్తు చేశారు. తాను బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి సంపాదించిన సొమ్మును పేదల కోసం ఖర్చు చేస్తున్నానని ఆయన చెప్పారు. తాను నాలుగేళ్లు ఎమ్మెల్యే అని... చంద్రబాబు నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెబుతున్నారన్నారు. చంద్రగిరిలో రేషన్ డీలరుపై ఓడిపోయిన చరిత్ర చంద్రబాబుది అన్నారు. ఈసారి కుప్పంలో చంద్రబాబుకు ఘోర పరాభవం తప్పదన్నారు. చంద్రబాబును కుప్పంలో జగన్ తప్పకుండా ఓడిస్తారన్నారు. తనకు తక్కువ అనుభవం ఉన్నప్పటికీ ధైర్యం ఉంటే చంద్రబాబు కానీ... నారా లోకేష్ కానీ తనపై పోటీ చేసి గెలవాలన్నారు. బొజ్జల కుటుంబం పూర్తిగా అవినీతిలో కూరుకు పోయిందన్నారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో బొజ్జల బందమ్మ వెండి తీసుకెళ్లినందుకు ఓ అధికారి కుటుంబం ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందన్నారు. బొజ్జల సుధీర్ తన చిన్నాన్న బొజ్జల హరినాథరెడ్డిని చంపేశారని బియ్యపు మధు ఆరోపించారు. బొజ్జల సుధీర్ రెడ్డికి భయపడి హరినాథరెడ్డి కుమారుడు సురేష్ రెడ్డి హైదరాబాదుకు వెళ్లి పోయారన్నారు. ఆయన భయపడకూడదని... తాను అండగా ఉంటానని ఇటీవల ఇతరులతో చెప్పిపంపానన్నారు. ఇలాంటి నీచపు రాజకీయాలు చేసే బొజ్జల సుధీర్ రెడ్డి ఎన్నికల్లో తనపై పోటీకి అర్హుడు కాదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో చర్చించి బొజ్జల కుటుంబం చేసిన అక్రమాలు, భూ కబ్జాలపై విచారణ చేయిస్తామన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ ను ఉత్తరకొరియాతో పోల్చడం విడ్డూరంగా ఉందన్నారు. కిమ్ రాజనీతి చంద్రబాబుకు సరిగా సరిపోతుందన్నారు. ఉత్తర కొరియా అధ్యక్షులు కిమ్ లాగా చంద్రబాబు కూడా అతని మామ నందమూరి తారక రామారావుకు వెన్నుపోటు పొడిచారని ఆయన ఆరోపించారు. జగన్ తన సోదరి వైఎస్ షర్మిలకు ఆస్తిలో హక్కు కల్పించలేదని చంద్రబాబు ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు సంపాదించిన ఆస్తిలో ఆయన సోదరుడు నారా రామ్మూర్తి నాయుడుకు ఎందుకు వాటా ఇవ్వలేదన్నారు. నారా రామ్మూర్తి నాయుడుకు స్లో పాయిజన్ ఇచ్చి బయటకు రాకుండా చేశారన్నారు. నారా రోహిత్ సినిమాల్లో అవకాశం లేకుండా లోకేష్ చేస్తున్నారన్నారు. వైఎస్ షర్మిలకు జగన్ ఆస్తిలో ఎంత వాటా ఇచ్చారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. ఇక తాను అక్రమాలకు పాల్పడుతున్నట్లు చంద్రబాబు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. బొజ్జల కుటుంబమే పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడి ప్రజల సొమ్ముతో రూ.వేల కోట్లకు పడగ లెత్తిందన్నారు. ఈ సొమ్ముతో వారు సింగపూర్, మలేషియాలో వ్యాపారాలు చేస్తున్నారని బియ్యపు మధుసూదనరెడ్డి ఆరోపించారు. బొజ్జల సుధీర్ రెడ్డిని ఆయన వీరప్పన్ తో పోల్చారు. తాను శ్రీకాళహస్తిలో ఎంత అభివద్ధి చేశానో చర్చకు సిద్ధమన్నారు. స్వర్ణముఖి సుందరీకరణ, ఏడు రింగు రోడ్లు, హిందూ స్మశాన వాటిక, తొట్టంబేడు మండల రైతులకు తెలుగుగంగ నీరు ఇవన్నీ తన హయాంలో చేసినవే అన్నారు. మహాశివరాత్రికి 16ఏళ్లుగా బంగారు తాళిబొట్లు పంపిణీ చేస్తున్నానని ఆయన చెప్పారు. తన హయాంలో శ్రీకాళహస్తీశ్వర ఆలయం ఎంతో అభివద్ధి చెందిందన్నారు. చంద్రబాబు నిర్లక్ష్యం కారణంగానే రేణిగుంట మండలంలోని బాలాజీ రిజర్వాయరు పనుల్లో జాప్యం చోటు చేసుకుందన్నారు. శ్రీకాళహస్తి ప్రజలకు అన్నీ ఎవరు ఎలాంటి వారో అందరికీ తెలుసనీ, తగిన సమయంలో వారు తగుబుద్ధి చెబుతారన్నారు.

# విద్యార్థులు విజ్ఞానవంతులుగా ఎదగాలి

### ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డి



ప్రజాశక్తి- తిరుపతి సిటి: విద్యార్థులు విజ్ఞానవంతులుగా ఎదిగి, అటు దేశాభివృద్ధికి, ఇటు వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేణాధికారి (ఆర్ఐవో) గుమ్మడి వెంకట ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఇటీవలే ఆర్ఐవోగా బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఆల్ ఇండియా రేడియోస్టేషన్ వెనుక, ప్రభుత్వ గ్రంథాలయం పక్కనున్న ఆర్ఐవో కార్యాలయంలో ఆయనను కలిసిన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ కడప జిల్లా వేపంల్లిలో జి.వెంకటరెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు సంతానంలో తాను ఒకడని, తన స్కూల్ విద్యాభ్యాసం, ఇంటర్మీడియట్ విద్య మొత్తం వేంపల్లిలో సాగిందన్నారు. లయాల కాలేజిలో డిగ్రీ పూర్తి చేశానని అన్నారు. కదిరి గవర్నమెంట్ కళాశాలలో 1993లో కెమిస్ట్రీ జూనియర్ లెక్చరర్‌గా విధుల్లో చేరానని తెలిపారు. అదే కాలేజికి 2011లో ప్రిన్సిపాల్‌గా పనిచేశానని, సీవోఈగా, జాయింట్ డైరెక్టర్ కార్యాలయం సిఐగా, ఎస్ఐవిఇ ప్రొఫెసర్‌గా విజయవాడ, గుంటూరులో విధులు నిర్వహించి, పాపానాయుడుపేట గవర్నమెంట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉంటూ పదోన్నతిపై తిరుపతి ఆర్ఐవోగా వచ్చానని, జూలై 7వతేదీ బాధ్యతలు స్వీకరించినట్లు వెల్లడించారు. తాను బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జిల్లాలోని ఇంటర్మీడియట్ కళాశాలలను తరుచు తనిఖీ చేస్తూ, విద్యార్థులకు ఎలాంటి సమస్యల లేకుండా చూడాలని కళాశాలల నిర్వాహకులకు సూచిస్తూ, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నానన్నారు. ప్రైవేట్ కళాశాలలకు సైతం ఈ ఆఫీస్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. ప్రతి కళాశాలకు శానిటరీ, బిల్డింగ్, ఫైర్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి కళాశాలలకు కేటాయించిన సెక్షన్ల ప్రకారమే తరగతులు నిర్వహించాలని, సెక్షన్లకు విరుద్ధంగా వ్యవహరిస్తే రూ.4 నుంచి 5లక్షల వరకు జరిమానా తప్పదన్నారు. విద్యార్థులకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు (టిసిలు) ఇచ్చే సమయంలో కొన్ని ప్రయివేట్ కళాశాలలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని విద్యార్థి సంఘాలు తమ దృష్టికి తీసుకొచ్చాయని, అలాంటి వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. డేస్కాలర్స్, హాస్టల్ విద్యార్థులకు అవసరమైన అన్నిరకాల సౌకర్యాలను ఆయా కళాశాలల నిర్వాహకులు తప్పనిసరిగా కల్పించాలన్నారు. అర్హులైన అధ్యాపకులచే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు ప్రతిఒక్కరు కృషిచేయాలని సూచించారు. నిర్ణయిత ఫీజుల కంటే అధిక శాతం విద్యార్థుల నుంచి వసూళ్లు చేసేందుకు ఎవ్వరైన ప్రయత్నిస్తే ఫీజ రెగ్యులేట్ కమిటీ తనిఖీలు చేసి కఠినచర్యలు తీసుకుందన్నారు. ర్యాంకుల పేరుతో విద్యార్థులను శారీరక, మానసిక ఒత్తిడికి గురిచేయడం సరైనది కాదని, అలా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవన్నారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఇంటర్మీడియట్ విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలలో సైతం కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా సౌకర్యాలు కల్పిస్తోందని, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్యను అందిస్తుందని, దీని ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించించే దిశగా దూసుకుపోతున్నారని, గత ఏడాది విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. విద్యాశాఖ, ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలన్ని కూడా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించేందుకే ఉన్నాయి, ఆ దిశగా ప్రతి ఒకరు కృషి, విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని సూచించారు.



ఇంటర్వ్యూ

## ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సంతాపం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్రముఖ ప్రజాగాయకుడు గద్దర్ మృతిపట్ల సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన తనకళలతో ప్రజలను చైతన్య పరచడానికి కృషి చేశారు. అనేక దశాబ్దాలపాటు యువతను ఉద్రూత లూగించారని, జానపద కళారూపాలకు విప్లవ సాహిత్యాన్ని జోడించి ప్రజాసంస్కృతికి పట్టం కట్టారని అన్నారు. సామాజిక మార్పు కోసం తపనపడ్డారు. ఇందు కోసం నిర్బంధాన్ని అనుభవించారని, వారి మృతి అభ్యుదయ, సాహిత్య లోకానికి, ప్రజాఉద్యమాలకు తీరనిలోటు అని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

ప్రముఖ ప్రజాగాయకుడు గద్దర్ మృతి పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తిరుపతి జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే తిరుపతి సాహితీ స్రవంతి కన్వీనర్ ఓ వెంకట రమణ, కో-కన్వీనర్ డాక్టర్ సాయిలక్ష్మి ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ మృతి పట్ల సంతాపం తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటనలో తెలిపారు.

శ్రీకాళహస్తి: ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి పీడిత వర్గాలకు తీరని లోటని జననాట్యమండలి మాజీసభ్యులు, ఆయన అభిమానులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమాజానికి తన మాట, పాట ద్వారా అలుపెరుగని పోరాటం చేసిన విప్లవ వీరుడు గద్దర్ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో గద్దర్ విడదీయరాని బంధం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ప్రకటన విడుదల చేసిన గద్దర్ అభిమానులు వలిపి శ్రీరాములు, గంధం కిషోర్, సుదర్శన్, పాదం శివన్న, శంకరరెడ్డి, మదన్, కష్ణంరాజు తదితరులు ఉన్నారు. గద్దర్ కు వీరు విప్లవ జోహార్లు తెలియచేశారు.

## 'ఘనంగా స్నేహితుల దినోత్సవం'



స్నేహితుల దినోత్సవం జరుపుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: 1983-84 సంవత్సరానికి చెందిన నెహ్రూ మున్సిపల్ హైస్కూలు పూర్వవిద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. కపిలతీర్థం బైపాస్ రోడ్‌లోని ఓ ప్రైవేటు హోటల్లో ఈకార్యక్రమం జరిగింది. స్నేహితులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సిపిఎం జిల్లా నేత కందారపు మురళి, మున్సిపల్ ఆర్ఓ కె.లోకేశ్వరవర్మ, అర్జున్ ఎలక్ట్రికల్స్ అధినేత అర్జున్, జయచంద్ర, సుబ్రహ్మణ్యం, సురేంద్ర, మన్నేపల్లి బాలకష్ణ, డాక్టర్ రామ్ కుమార్, అశోక్, ప్రిన్సిపల్ రమేష్, ఆర్ఆర్ శ్రీనివాస్, గిరిధర్, సుబ్బారావు, కెబి.శ్రీనివాస్, బివి.రాయ్, గురుమూర్తి, కుప్పస్వామి, చంద్రమౌళి, శ్రీను, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐద్వా రాష్ట్ర సభను జయప్రదం చేయండి


### జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి పిలుపు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం డ్రగ్స్, నియంత్రించాలని మహిళలపై జరిగే హింస అరికట్టాలని కోరుతూ గత నెల 28వ తేదీన సత్యసాయి జిల్లా హిందూపూర్ నుండి బస్సుయాత్ర ప్రారంభమై అన్ని జిల్లాలు తిరుగుతూ మహిళాలను చైతన్యం చేస్తూ ఈనెల 8వ తేదీన విజయవాడ చేరుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ జింఖానా గ్రౌండ్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సభకు ముఖ్యఅతిథిగా ఐద్వా కేంద్ర నాయకురాలు మాజీ ఎంపి బందాకారత్ విచ్చేయుచున్నారని పేర్కొన్నారు. మహిళాపై జరిగే హింసకు వ్యతిరేకంగా పోరాడాలని, ఈసభకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# ఎమ్మెల్యే భూమనకు అభినందనల వెల్లువ



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి ఎమ్మెల్యే నూతన టిటిడి చైర్మన్ బాధ్యతలు చేపట్టనున్న భూమన కరుణాకర్‌రెడ్డి ఆదివారం పలువురు ప్రముఖులు కలిసి అభినందనలు తెలియజేశారు. తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కె.రామారావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్కె.బాబు, కోఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ ఖాదిరి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎస్.ఖాదర్ బాషా, ఆర్.శ్రీదేవి, మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి కేఎల్.వర్మ సేతు మాధవ్, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ మోహన్ ఈఈలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి డీఈలు విజయ్ కుమార్‌రెడ్డి, దేవిక, సంజయ్ కుమార్, రవీంద్రారెడ్డి, మహేష్ యాదవ్, గోమతి, కార్పొరేటర్లు టీటీడీ ఉద్యోగులు, వివిధ రంగాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు కరుణాకర్ రెడ్డిని కలిసి సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు.



టీటీడీ నూతన చైర్మన్ కరుణాకర్ రెడ్డికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి డిప్యూటీ సీఎం నారాయణస్వామి అభినందనలు తెలుపుతున్న దృశ్యం

# రమాకాంత శర్మకు బెస్ట్ పిఆర్ కౌన్సిలర్ అవార్డు

### ప్రొఫెసర్ త్రిపురసుందరికి బెస్ట్ పిఆర్ టీచర్ అవార్డు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్ వ్యవస్థాపక అధ్యక్షులు సి.రమాకాంత శర్మకు బెస్ట్ పబ్లిక్‌రిలేషన్స్ కౌన్సిలర్ అవార్డు లభించింది. అదేవిధంగా పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ పూర్వఅధ్యక్షురాలు, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం జర్నలిజం ప్రొఫెసర్ త్రిపుర సుందరిని బెస్ట్ పబ్లిక్ రిలేషన్స్ టీచర్ అవార్డు వరించింది. పిఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్, సివిఎన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదులోని బెస్ట్ వెస్ట్రన్ హోటల్లో 16వ పబ్లిక్ రిలేషన్స్ ఎడ్యుకేషన్‌డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ మీడియా సలహాదారు డాక్టర్ కెవి.రమణాచారి విశిష్టఅతిథిగా విచ్చేసి ప్రజాసంబంధాల గొప్పతనాన్ని సోదాహరణంగా వివరించారు. ముఖ్యఅతిథులుగా ఐఎఫ్ఎస్ అధికారి రాజశేఖర్, పిఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు అజిత్ పాథక్ విచ్చేశారు. హైదరాబాదులోని ఇమేజినేటివ్ కొల్లాబరేట్ సంస్థ సిఈవో హేమంత్ సత్యనారాయణ కీలక ఉపన్యాసం చేశారు. అనంతరం డాక్టర్ రమణాచారి చేతులమీదుగా రమాకాంత శర్మకు, ప్రొఫెసర్ త్రిపురసుందరికి అవార్డులు ప్రదానం చేశారు.




తిరుపతి చాప్టర్ హర్షం

తిరుపతి చాప్టర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరికి అవార్డులు రావడం పట్ల చాప్టర్ చైర్మన్ కె.శ్రీనివాసరావు, కార్యదర్శి డి.చంద్ర మోహన్ హర్షం వ్యక్తం చేశారు. అవార్డులు అందుకున్న వారికి అభినందనలు తెలియజేసిన వారిలో చాప్టర్ వైస్‌చైర్మన్ చంద్రమోహన్ రావు, ట్రెజరర్ ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్, మాజీ చైర్మన్లు డా.ఎన్.బి.సుధాకర్ రెడ్డి, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ హర్షవర్ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆర్‌సికె.రాజు తదితరులు ఉన్నారు.

## కార్మికులను కొట్టడం దుర్మార్గం

### సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లాలో పుంగనూరులో జరిగిన ఘటనను సాకుగా చూపి అధికార పార్టీ నిర్వహించిన బంద్ సందర్భంగా చిత్తూరులో కార్మికుల బస్సుపై దౌర్జన్యం చేసి కార్మికులను విచక్షణ రహితంగా కొట్టడం దుర్మార్గమని ఆ ఘటనను సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరులో జరిగిన దౌర్జన్యంపై సమనయం పాటించాల్సిన అధికార పార్టీ రెచ్చగొట్టే పద్ధతుల్లో వ్యవహరించడంతో పోలీసులు కూడా గాయాలు అయ్యేవిధంగా పరిస్థితిని తీసుకురావడం పూర్తిబాధ్యత అధికారపార్టీ దేనిని తెలిపారు. ఆ సంఘటన చూపి బంద్‌కు పిలుపునిచ్చి చిత్తూరులో వ్యాపారస్తులపైన, కార్మికుల పైన అదే విధంగా కుప్పంలో ఆర్టీసీ బస్సులు ధ్వంసం చేయడం లాంటి ఘటనలు అధికార పార్టీ నాయకులు చేస్తుంటే పోలీసులు చూస్తూ ఊరుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతిపక్షపార్టీలు బంద్‌కి పిలుపునిచ్చిన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్న వారిపై అరెస్టులు కేసులు పెడుతున్న పోలీసులు మరి అధికారి పార్టీ వాళ్ళ దౌర్జన్యాలు చేసినా ఎందుకు చూస్తూ ఊరుకున్నారని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకటేనని అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అధికారపార్టీ దౌర్జన్యాలను ఇప్పటికైనా అరికట్టి జిల్లాలో శాంతిభద్రతకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

### గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్

## నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) చిత్తూరు జిల్లా నూతన కమిటీ ఎన్నిక సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేంద్రన్, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య సమక్షంలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. అధ్యక్షులుగా మధు, కార్యదర్శి గోవిందప్ప, కోశాధికారి రామకష్ణ, ఉపాధ్యక్షులు మారెమ్మ, రమణ, సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి డి.సుబ్రహ్మణ్యం, నాగరాజు, కాలేషావల్లి, సంపూర్ణమ్మలతోపాటు 16 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న పంచాయతీ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు

## మిద్ది తోటల పెంపకంతోనే ఆరోగ్యం

### మార్కెటింగ్ మేనేజర్ ప్రభాకర్




ప్రజాశక్తి- తిరుపతి సిటీ: మిద్ది తోటల పెంపకంతోనే ఆరోగ్యం ఆయుష్షు ఆర్థిక అభివద్ధి. ఆర్గానిక్ మేళా ముగింపు సమావేశంలో వక్తల వెల్లడించారు. నేడు పట్టణ ప్రాంతాల్లో మిద్దె తోటల పెంపకం విపరీతంగా పెరుగుతోందని గోదారిత ప్రకతి వ్యవసాయదారుల ముగింపు సమావేశంలో పలువురు వక్తలు పేర్కొన్నారు.ఆర్గానిక్ మేళా మూడో రోజు అయిన ఆదివారం ఇస్కాన్ గ్రౌండ్లో జరిగిన మిద్దెతోటల పెంపకందారుల సమావేశంలో భారీస్థాయిలో జరిగింది. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ మేనేజర్ ప్రభాకర్ మాట్లాడుతూ పల్లెల్లో వ్యవసాయం నేడు పట్టణాలకు పాకిందని, ఇందుకు ప్రధాన కారణం మిద్దెలపై తోటలు పెంచాలనే ఆసక్తి ప్రజల్లో పెరగడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. మిద్దెలపై తోటలు పెంచడం వల్ల ప్రతిరోజూ ఒక వ్యాయామం లాగా ప్రతిఒక్కరికీ ఉపయోగపడుతుందని అన్నారు. అంతేకాక మనం సొంత కాయగూరలు పండ్లు పూలు మనమే పండించుకొని భుజించడం ద్వారా సంతప్తి కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మిద్ది తోటల పెంపకం దారులను ఉద్దేశించి కోదారిత గోఆధారిత ప్రకతి వ్యవసాయదారుల వ్యవస్థాపకులు కుమార్ స్వామి మాట్లాడుతూ ప్రతి మిద్దె నేడు పంటలతో కళకళ లాడుతున్నాయని అన్నారు. ఎక్కువమంది మిద్దె తోటల పెంపకానికి పోటీలు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు వద్ధులు, మిద్దెలపై అనేక రకాల కాయగూరలు పండిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. తిరుపతి టెర్రస్ గార్డెన్ సభ్యుల కోసం ఆర్గానిక్ మేళా ప్రాంగణంలో జరిగిన ఈసమావేశంలో సిటిజి కోర్ కమిటీ సభ్యులు నడింపల్లి కష్ణ అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమంలో రైతు సాధికార సంస్థ జిల్లా అధికారి మునిరత్నం, సిటిజి కోర్ కమిటీ సభ్యులు టీవీ మనోహర్ ప్రకతి వ్యవసాయ నిపుణులు గంగాధరం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సిటిజి సభ్యులను మేళా నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. గతమూడు రోజులుగా జరిగిన రాయలసీమ ఆర్గానిక్ మహిళ ఆదివారంతో ముగిసింది.

### గ్రామ పంచాయతీ, వార్డ్ మెంబర్ల

## ఎన్నికల నోటిఫికేషన్ జారీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: గ్రామపంచాయతీ, వార్డు మెంబర్ల ఎన్నిక కొరకు నేటి ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు జిల్లాలోని గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నిక కొరకు షెడ్యూల్ జారీ చేసిందని జిల్లా పంచాయితీ అధికారి, జిల్లా అదనపు ఎన్నికల అధికారి రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సహాని విడుదల చేసిన షెడ్యూల్ మేరకు తిరుపతి జిల్లాలో ప్రస్తుతం వివిధ ఆకస్మిక కారణాల వల్ల ఖాళీ ఏర్పడిన 41 వార్డు మెంబర్లు, 5 సర్పంచ్‌ల ఎన్నిక నిమిత్తం ఈనెల 8న ఎలక్షన్ నోటీస్ సంబంధిత రిటర్నింగ్ అధికారులు విడుదల చేస్తారని తెలిపారు. 10న నామినేషన్‌ల స్వీకరణ చివరి రోజు, తేదీ 11న నామినేషన్ల స్క్రూటినీ, తేదీ 12న తిరస్కరించబడిన నామినేషన్లపై అప్పీల్, తేదీ 13న అప్పీళ్ల డిస్పోజల్, 14న విత్ డ్రా చేసుకున్న అభ్యర్థుల ప్రకటన, ఎన్నికలలో పోటీ పడుతున్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, తేదీ 19న పోలింగ్ నిర్వహణ ఉదయం 7 నుండి మధ్యాహ్నం 1గంట వరకు, కౌంటింగ్ అదేరోజు మధ్యాహ్నం రెండు గంటల నుండి ఉంటుందని తెలిపారు. గెలిచిన సర్పంచ్, వార్డు మెంబర్లు అభ్యర్థుల ఫలితాల ప్రకటన కౌంటింగ్ అయిన వెంటనే ఉంటుందనీ, రీపోల్ ఉన్నచోట ఈ నెల20 న నిర్వహించాల్సి ఉంటుందని ఆ ప్రకటనలో తెలిపారు.

## అడిషనల్ ఎస్పీని పరామర్శించిన ఎస్పీ

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: పుంగనూరు అల్లర్ల ఘటనలో గాయపడ్డ ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావును జిల్లా ఎస్పి రిషాంత్‌రెడ్డి ఆదివారం అడిషనల్ ఎస్పీ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ సంఘటన సమయంలో పోలీసులు చూపిన చొరవ పాటించిన సంయమనం ఎంతో గొప్పదని తెలిపారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావుకు సూచించారు.

## క్రియాశీలక సభ్యుని కుటుంబానికి సాయం



**ప్రజాశక్తి-గూడూరు రూరల్:** దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా పార్టీలో పనిచేస్తున్న క్రియాశీలక సభ్యుని కుటుంబానికి ఆర్థిక భరోసా కలిగిస్తూ రూ.5 లక్షలు యాక్సిడెంట్ బీమా సౌకర్యాన్ని కల్పించిన ఏకైక రాజకీయ పార్టీ జనసేన అని ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ తెలిపారు. తిరుపతి జిల్లా కోగిలి గ్రామంలో ఆదివారం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు పార్టీ కేంద్ర కార్యాలయం నుండి వచ్చిన జనసేన కిట్లను అందజేశారు. మండలం నాయకులు అక్బర్, వాసు, క్రాంతి, శరత్, రాము, ప్రవీణ్, వినోద్, సుబ్బు, గురు, సిద్ధు, ఇంద్రవర్ధన్, రాజశేఖర్, శంకర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 25 న టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు

**ప్రజాశక్తి-గూడూరు టౌన్:** గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలోఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు ఈ సంవత్సరం 17 మండలాల జట్లతో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈనెల 25, 26, 27వ తేదీలలో నిర్వహించనున్నారు. ఈ క్రికెట్ లీగ్ లో పాల్గొను చున్న 17 మండలాల టీం కెప్టెన్స్ తో ఆదివారం సనత్‌నగర్ లోని శ్రీచైతన్య హైస్కూల్‌లో క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టోర్నమెంట్ సంబంధించిన పలు అంశాలు చర్చించి లాటరీ పద్ధతిలో 17 టీమ్స్‌కు స్పోర్ట్స్‌వేర్ కలర్స్‌ను నిర్ణయించారు. అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ టీచర్స్ కోసం ఈ టోర్నమెంట్ ను రాష్ట్ర స్థాయిలో నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధమైనట్టు తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ టెక్నికల్ డైరెక్టర్ పి.డి. కరీముల్లా, టెక్నికల్ మెంబర్ బాబర్, సీనియర్ క్రీడాకారులు మునిభాస్కర్, శ్రీహరి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## విత్తన పంపిణీలో అవకతవకలు జరగలేదు



**ప్రజాశక్తి-యర్రావారిపాలెం:** ఖరీఫ్ సీజన్లో మండలంలో వేరుశనగ విత్తనాలు, ఉలవలు రైతులకు పంపిణీ చేయడంలో ఎటువంటి అవకతవకలు జరగలేదని ఏవో ఖాదర్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకే విత్తనాలు, మినీ కిట్‌ల రూపంలో రైతులకు వేరుశనగ, ఉలవలు రైతు భరోసా కేంద్రంలో బయోమెట్రిక్‌తో 1,268 మంది రైతులకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కొంతమంది రైతులు శనివారం రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ, ఉలవల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఉద్దేశపూర్వకంగా ధర్నా చేశారని.. విత్తన పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగలేదని తెలిపారు. కొన్ని దినపత్రికలలో విత్తనాలు పంపిణీలో అవకతవకలు జరిగాయని రావడం అవాస్తవమని వివరించారు.

## క్రైస్తవులపై దాడి చేసిన వారిని శిక్షించాలి




**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** మణిపూర్‌లో క్రైస్తవ మహిళలను నగ్నంగా చేసి అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివారం పుత్తూరు సెయింట్ పాల్ లూథరన్ చర్చి సంఘం బిషప్ పాస్టర్ జీడీ సుందర్ శేఖర్, సంఘ ఛైర్మన్ శరత్‌చంద్ర, వైస్ ప్రెసిడెంట్ ఆర్ దీపక్, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. చర్చి నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు మార్టిన్ మహిమదాస్, పీఆర్పీ సుధాకర్, రాజేంద్రప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

## గిరిజన పిల్లలకు దుస్తుల పంపిణీ



**ప్రజాశక్తి-ఏర్పేడు:** మండలంలోని పాగాలి పంచాయతీలోని కుమ్మరిగుంట ఎస్టీ కాలనీలో యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిజన పిల్లలకు దాతల సహాయంతో జత దుస్తులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షులు మధురాంతకం మునిశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు గ్రామాలకు దూరంగా ఉండటంతో గిరిజన పిల్లలు చదువుకోవడానికి బడులకు వెళ్లలేకపోతున్నారన్నారు. అధికారులు గిరిజన పిల్లలు బడులకు పోయేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల కోఆర్డినేటర్లు అరుణ, నాగమణి, వాలంటీర్లు వెంకటేశులు, స్రవంతి, హేమలత, ముత్యాలమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



**ప్రజాశక్తి -గూడూరు:** ప్రపంచమంతా మిమ్మల్ని వదిలిపోయినా.. మన చేయి పట్టుకుని నడిపించగలిగే మనస్సు ఉన్నవాడే నిజమైన స్నేహితుడు అని గూడూరు మండలం కొమ్మనేటూరు ఎంపిటిసి సభ్యుడు గడ్డం సహదేవ్ అన్నారు. స్నేహంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తే గాని తెలియదన్నారు. ఎటువంటి సంబంధం లేకుండా బలమైన బంధంగా ఏర్పడేది స్నేహమన్నారు. స్నేహితుల దినోత్సవం రోజు 1990-91వ సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల కలయిక సంతోషదాయకమని తెలిపారు. కొమ్మనేటూరు గ్రామంలో కోట గురుకుల పాఠశాలలో 1990-91 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయంగా కలిశారు. పాత జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. వీరరాఘవులు అనే పూర్వపు విద్యార్థి ఇటీవలే పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందడంతో ఆయన్ను ఘనంగా సత్కరించారు.

# జర్నలిస్టులకు అన్ని విధాలా అండగా ఉంటా

## చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** జర్నలిస్టుల సంక్షేమం కోసం అన్ని విధాలా ఆదుకుంటామని చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్ సభ్యుల సంక్షేమం కోసం మెగా ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపు ప్రారంభానికి ఎమ్మెల్యే చెవిరెడ్డితో పాటు తిరుపతి రూరల్ ఎంపిపి, చంద్రగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ సొంత స్థలం కోసం సహకారమందిస్తూనే భవన నిర్మాణానికి ట్రస్ట్ నుంచి రూ.10 లక్షల రూపాయలను అందిస్తామన్నారు. ప్రస్తుత ప్రెస్‌క్లబ్‌ను ఆధునికీకరించడానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి సుముఖత చూపారు. 42 రకాల వైద్య పరీక్షలు చేశారని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, బాలచంద్ర తెలిపారు. మెడికల్ క్యాంపు ముగిసే సమయానికి 304 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలను నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు విక్రమ్, సంయుక్త కార్యదర్శి ద్వారకానాథ్, ఈసి మెంబర్లు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీలో పలువురి చేరిక



**ప్రజాశక్తి -గూడూరు :** పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వాకాడు మండల పార్టీ అధ్యక్షులు దువ్వూరు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పూడి రాయిదొరువు పంచాయతీ మాజీ సర్పంచ్ యల్లబోతు రాజగోపాల్ రెడ్డి అధ్యక్షతన 200 వైసీపీ కుటుంబాల వారిని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలుగు దేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ పూడిరాయి దొరువు పంచాయతీ నుండి 4 వార్డు మెంబర్స్, సీనియర్ నాయకులు చేరడం చాలా సంతోష కరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, పూడిరా యిదొరువు పంచాయతీ నాయకులు మాజీ సర్పంచ్ యల్లబోతు రాజగోపాల్ రెడ్డి, మామిడి గోవిందయ్య, మాజీ ఉపాధ్యక్షులు తంగా సుబ్బా రెడ్డి, అయిల్ రెడ్డి, మీరాల్ రెడ్డి, తీపలపూడి రమణయ్య, వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు జయమ్మ, మీనా, నాగభూషణమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సంస్థ అభివృద్ధికి అందరి సహకారం




**ప్రజాశక్తి-తిరుచానూరు:** ఎస్బీఐ కోఆపరేటివ్ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని తిరుచానూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేవీఎస్ మూర్తి మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి సహకరిస్తున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం 1200 మంది సభ్యులకు గాను 800 మంది హాజరు కావడం చాలా సంతృప్తి నిచ్చిందన్నారు. సంస్థలో సభ్యులకు ఎస్బీఐ పూర్తి సహకారం అందిస్తుందని.. అవసరమైన లోన్లు ఇస్తూ తోడ్పడుతోందన్నారు. అభివృద్ధికి ఎస్బీఐ సొసైటీ ప్రెసిడెంట్ సురేష్, సెక్రటరీ వెంకటసుబ్బయ్య ఎంతగానో ప్రోత్సాహాన్ని అందిస్తూ సహక రిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్బీఐ ఎస్‌యుఏసీ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్ రెడ్డి, జనరల్ సెక్రటరి చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం




**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** స్థానిక కామరాజ్‌నగర్‌లోని స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ సెంటర్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో స్కౌట్ మాస్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్ మాస్టర్ స్నేహితుల దినోత్సవం గురించి అవగాహన కల్పించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గేట్ పుత్తూరు జడ్పీ హైస్కూల్ స్కౌట్ మాస్టర్ జయదేవ్, రేంజర్ లీడర్ భువనేశ్వరి, శైలజ, మల్లేశ్వరి, గైడ్ కెప్టెన్ రోజా, గైడ్స్ లీడర్ చారులత, గీతిక తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

### కేశవరెడ్డి స్కూల్‌లో...




**ప్రజాశక్తి-రేణిగుంట:** మామండూరు పంచాయతీలోని కేశవరెడ్డి ఈఎం స్కూల్‌లో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. సృష్టిలో స్నేహం కంటే గొప్ప విలువైన బాంధవ్యాలు ఏమీ లేవని తెలియజేశారు. కేశవరెడ్డి విద్యాసంస్థల ఫౌండర్, ఛైర్మన్ శ్రీ కేశవరెడ్డి మాట్లాడుతూ స్నేహానికి డబ్బు, హోదా, కులం, మతం, ధనిక పేద అనే తారతమ్యాలు లేవని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు యూఎస్ సహకారం




**ప్రజాశక్తి-క్యాంపస్ :** భారతదేశంలో మహిళల అభివృద్ధికి.. మహిళల చదువులకు.. సాధికారతకు యూఎస్ ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని యుఎస్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ జెనీఫర్ లారెన్స్ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఉమెన్ బయోటెక్ ఇంకుబేషన్ ఫెసిలిటీ వీకో సిస్టం పార్టనర్స్ గా నిర్వహిస్తున్న అకాడమీ ఫర్ ఉమెన్ అండ్ ట్రోఫీసర్స్ ప్రోగ్రాంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం యుఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళలు చదువు, విద్య, వ్యాపారం, ఇతర అన్ని రకాల రంగాలలో దూసుకెళ్లేందుకు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.భారతి మాట్లాడుతూ మహిళా వర్సిటీలో విద్యార్థినీలకు పరిశోధకులకు ఎన్నో అద్భుతమైన అధునాతనమైన ల్యాబ్ సౌకర్యాలు, సౌకర్యాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకొని ఉన్నతరంగాలలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుల సజీవులు ఆచార్య ఎన్. రజిని, డబ్ల్యుబి ఐఎఫ్ సిఈఓ ఆచార్య వి.కళారాణి, శిల్పా నాయిని, మాధవి, హారిక, జ్యోతి, విద్యావతి, విజయలక్ష్మి, శ్రీరజిని, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

# ప్రజల అవసరాలకే మాస్టర్‌ప్లాన్ రోడ్లు



**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ప్రజల అవసరాల నిమిత్తమే మాస్టర్ ప్లాన్ రోడ్లు వేస్తున్నామని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో మాస్టర్ ప్లాన్ రోడ్లను రూపొందించి అమలు చేయడం మరచిపోయారని, తిరుపతి నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించడానికి 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను వేస్తున్నామన్నారు. ఎస్వీయూలో వేయతలపెట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్లపై రాజకీయ శక్తులు తీవ్రమైన ఆరోపణలు, అలజడులు సృష్టించారన్నారు. మాస్టర్ ప్లాన్‌పై వస్తున్న అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని స్వల్ప మార్పులు చేసి అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# మహిళా వర్సిటీలో ఫ్యాషన్ షో



**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం హోం సైన్స్ విభాగంలో భాగమైన బ్యాచిలర్ ఆఫ్ వోకేషనల్ ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ అపారెల్ డిజైనింగ్ కోర్సులో భాగంగా ఫ్యాషన్ షో నిర్వహించడం జరిగింది. ఈ ఫ్యాషన్ షోలో 2022-23 సంవత్సరం బ్యాచ్ సంబంధించిన మొదటి సంవత్సరం విద్యార్థులు, చిన్నారులు కూడా పాల్గొన్నారు. మొదటి సంవత్సరం సిలబస్ లో భాగంగా ఫ్యాషన్ షో జరిగింది. ఇందులో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.భారతి పాల్గొని విద్యార్థినులను అభినందించారు. ఈ వస్త్ర ప్రదర్శనలో హోమ్ సైన్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ వి. బిందు, ప్రొఫెసర్ ఎం. అరుణ, ఫ్యాకల్టీ రఫియ సుల్తానా, దేవి, హబీబుల్లా హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు, యూనివర్సిటీలోని ఇతర డిపార్ట్మెంట్ స్టూడెంట్స్, నాన్ టీచింగ్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

## పత్రీజి మహిళా చైతన్య సదస్సు విజయవంతం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** స్థానిక రోటరీ క్లబ్ వేదికగా శ్రీకాళహస్తి పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ మూమెంట్స్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన 'పత్రీజీ మహిళా చైతన్యం' సదస్సు విజయ వంతమైంది. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా, స్థానికంగా ఉన్న పిరమిడ్ మాస్టర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళా చైతన్యం, శాఖహారం, ధ్యానం ఆవశ్యకతలపై బ్రహ్మశ్రీ పితామహా పత్రీజీ సూచించిన 18 ఆదర్శ సూత్రాలను అక్కడికొచ్చిన వారికి వక్తలు ఉపదేశించారు. అనంతరం పలువురు వక్తలను, సీనియర్ పిరమిడ్ మాస్టర్లను ఘనంగా సత్కరించారు. పిరమిడ్ మాస్టర్లు శివాజీ, గురుస్వామి నాయుడు, శివ, రమ్య, మీర్జా తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

**ప్రజాశక్తి-క్యాంపస్ :** అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టకరమని ఆరోగ్య కరంగా ఉంటాయని చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రావణ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో గృహ విజ్ఞాన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు.

## టీడీపీతోనే మహిళల ఆర్థికాభివృద్ధి

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** టీడీపీతోనే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమని .. మహాశక్తి అనే కార్యక్రమంతో మహిళల్ని చైతన్యవంతులను చేయాలని నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ సూచించారు. ఆయన ఆదేశాల మేరకు పుత్తూరులోని నాలుగో వార్డ్ భవాని నగర్‌లో తెలుగు మహిళల ఆధ్వర్యంలో పుత్తూరు టౌన్ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్ ధనపాల్, కౌన్సిలర్ కేశవాచారి సహకారంతో తెలుగు మహిళా కమిటీ సభ్యులు భవానీ నగర్‌లో ఇంటింటికీ కరపత్రాలు పంచిపెడుతూ టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి యాళ్ళ లక్ష్మీ ప్రసన్న, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నాగరత్న, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రజనీ, టౌన్ మహిళ ప్రధాన కార్యదర్శి మోహన, యుగంధర్, ఆనంద్ ఈశ్వర్ యాదవ్, మాధవ నాయుడు, కేశవ, రవికుమార్ బాబు నాయుడు, మహమ్మద్ రఫీ, భాస్కర్ నాయుడు,వేలు, శ్రీరామ్, లక్ష్మణాచారి, ప్రసాదు ఉమా శంకర్ రెడ్డి, హమీద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

**ప్రజాశక్తి -వెంకటగిరి:** మణిపూర్‌లో మతం పేరుతో జరుగుతున్న దాడులను ఖండించాలని ఆప్రాంతలో శాంతి నెలకొల్పాలని వెంకటగిరి యూనైటెడ్ క్రిస్టియన్ వేల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అన్ని చర్చ్ పాస్టర్లు, భక్తులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా గొంతుక మూగబోయింది

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** ప్రజల కోసం తన జీవితాన్నే అంకితం చేసిన "ప్రజా గాయకుడు" గద్దర్ మృతితో ప్రజా గొంతుక మూగబోయిందని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

**క్యాంపస్:** ప్రజా సమస్యలపై పోరాటం చేసిన ప్రజా గాయకుడు గద్దర్. కవిగా, విప్లవకారుడిగా పేరుగాంచినటువంటి వ్యక్తి అని శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం తెలుగు విభాగాధిపతి కొలకలూరి మధుజ్యోతి అన్నారు. గొంతు లేని వారి గొంతుకుగా నిలిచి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఆయనకు తెలుగు శాఖ అధ్యాపకులు తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

**పుత్తూరు టౌన్ :** ప్రజా గాయకుడు గద్దర్ మృతిచెందడంతో పుత్తూరు పట్టణం అంబేద్కర్ సర్కిల్‌లో దళిత నాయకులు, బహుజన సంఘ నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు, యువజన నాయకులు, ఆటో కార్మికులు ఆయన ఫోటోకు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు కార్యక్రమంలో ప్రజా కళాకారులు నాగేంద్ర, ది మహేష్, దళిత నాయకులు గంగాధరం, ఎం వేలు, విజయ్, రవి కృష్ణమూర్తి, సాయికిరణ్, రాజేంద్ర, దిలీప్, లోకేష్, బాబీ, జై తేజ్, రమణ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణమందడి మృతికి నివాళులు

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** కైలాసపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు చంద్ర బాబు తండ్రి కృష్ణ మందడి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి ఆర్.కె.రోజా సోదరులు రాం ప్రసాద్‌రెడ్డి ఆది వారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.





## వివాహిత ఆత్మహత్య కేసులో భర్తకు రిమాండు



**ప్రజాశక్తి-పిచ్చాటూరు:** వరకట్న వేధింపులు తాళలేక వివాహిత భార్య కె.హేమవతి డీజిల్ పోసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటనలో కీళపూడికి చెందిన భర్త తిరుమల (29)కు రిమాండు విధించారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆదివారం విలేకర్లతో సమావేశం నిర్వహించారు. పరారీలో ఉన్న మృతురాలి భర్త తిరుమల (29)ను శనివారం కె.వి.బి పురం మండలం కోటమంగాపురం వద్ద అదుపులో తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడు తిరుమల తారు ప్లాంటు, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కారు కొనడం కోసం రూ.5 లక్షలు కావాలని రోజూ వేధింపులకు పాల్పడుతున్నట్లు చెప్పారు. మతురాలి బంధువులు సమీపంలో ఉండటంతో వెళ్లి రావడంతో ఈ నెల 1వ తేదీన రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. తీవ్ర ఆవేదన చెందిన కె.హైమావతి డీజిల్ పోసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. నిందితుడు వి.తిరుమలపై కేసు నమోదు చేసినట్లు డిఎస్పీ శ్రీనివాసులు చెప్పారు. కార్యక్రమంలో పుత్తూరు రూరల్ సీఐ సురేష్ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి



**ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ:** కారును లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందగా నలుగురికి గాయాలైన సంఘటన ఎన్టీఆర్‌నగర్ వద్ద ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చెన్నై పట్టణానికి చెందిన స్నేహితులు కారులో శ్రీకాళహస్తి వస్తుండగా శ్రీకాళహస్తి నుండి వస్తున్న లారీ ఎన్టీఆర్ నగర్ వద్ద కారును వేగంతో ఢీకొంది. కారు నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో ఆస్కర్(42)తోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఆస్కర్‌ను 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాథరెడ్డి తెలిపారు.